నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

సౌభగమ్ము చేత సంపద వచ్చిన
అహము పెక్కుపెరుగు అవనియందు
తెలివితోడ వచ్చు కలిమియంతయుగూడ
సంతసంబునిచ్చు సత్యమిదియె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 353 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 21-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



# కల్వకుంట్ల కుటుంబానికి కాలం చెల్లింది

## వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కదు

- వచ్చే ఎన్నికల్లో రా...తేల్చుకుందాం
- కాళేశ్వరంలో లక్షకోట్లు మింగారు
- రైతు సంక్షేమం కాంగ్రెస్ విధానం
- రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల
- 2034 వరకు మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం
- 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం
- మహేశ్ గౌడ్, నా జోడీతో మళ్లీ అధికారం దక్కించుకుంటాం
- నస్పూర్‌పల్లిలో బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తానని భ్రమపడుతున్నారని, కానీ తెలంగాణలో ఆ కుటుంబం శకం శాశ్వతంగా ముగిసిపోయిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతి, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఎలాగైతే తిరస్కరించారో, 2029 ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని -మిగతా 2 లో



# మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు


## ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ మోసం

- పునర్నిర్మాణ మహాయజ్ఞంలో భాగస్వాములు అవుదాం
- అన్నింటా దరిద్రం తాండవిస్తోంది
- రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మొదలుకుని అందరికీ దగా
- యూరియా కోసం మళ్లీ క్యూలు కట్టాల్సిన దుస్థితి
- ప్రాజెక్టులను పడావు పెట్టారు.. కరెంట్‌కు ఎగనామం పెట్టారు
- భూకబ్జాలు..అవినీతి తాండవిస్తోంది
- జగిత్యాల సభలో కెసిఆర్ విమర్శలు

రెండేళ్లయినా ఒక్క నిర్మాణాత్మక పనిలేదు



**జగిత్యాల, ఏప్రిల్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు మళ్లీ దాపురించాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ చుట్టుముట్టాయని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ పునర్నిర్మాణ మహాయజ్ఞంలో అందరూ కలసి రావాలని పిలుపుపిచ్చారు. ఏ వర్గం కూడా ఇప్పుడు సంతోషంగా లేరని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మొదలుకుని అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ప్రాజెక్టులను పడావు పెట్టారని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల -మిగతా 2 లో



# వచ్చే 4, 5 రోజులు నిప్పుల కొలిమే

- ఏప్రిల్ 25 వరకు దేశంలో తీవ్ర వడగాల్పులు
- కొన్ని రాష్ట్రాల్లో మాత్రం వడగళ్ల వానలు
- ఐఎండీ హెచ్చరికలు జారీ

న్యూఢిల్లీ
దేశంలో ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. కాగా రానున్న నాలుగు రోజుల పాటు దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు (హీట్ వేవ్) వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. ముఖ్యంగా ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 25 మధ్య వివిధ తేదీల్లో హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్, తూర్పు రాజస్థాన్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్, మధ్యప్రదేశ్, గంగానది పరివాహక పశ్చిమ బెంగాల్, కూర్గ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఉష్ణోగ్రత: ఏప్రిల్ 20–24 మధ్య గంగా పరివాహక పశ్చిమ బెంగాల్; ఏప్రిల్ 20–22 మధ్య తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్; ఏప్రిల్ 20–24 మధ్య కేరళ, మాహే, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, యానాం; ఏప్రిల్ 24, 25 తేదీల్లో -మిగతా 2 లో



# విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం

- కేసు జూన్ 15కు వాయిదా వేసిన కోర్టు
- భరణంపై కోర్టు బయట బేరసారాలు
- ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా భరణం డిమాండ్
- 35 కోట్లు మాత్రమే ఇస్తానన్న విజయ్

**చెన్నై, ఏప్రిల్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్ గా మారింది. ఒక వైపు రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి విమర్శలు, మరోవైపు వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఇప్పుడు దళపతినిఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజయ్ భార్య సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్ పై చెంగల్పట్టు కోర్టు విచారణను జూన్ 15కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే విజయ్ – సంగీత జంట పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. -మిగతా 2 లో

# జపాన్‌లో భారీ భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు
- సునామీ హెచ్చరిక జారీ




టోక్యో,
: జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరిక జారీ చేశారు. భూ ప్రకంపనల తీవ్రత కారణంగా వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యో వరకు పెద్ద భవనాలు కంపించాయి. మూడు మీటర్ల అంటే సుమారు 10 అడుగుల ఎత్తు వరకు అలలు ఎగసిపడే అవకాశం ఉందని జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరిక జారీ చేసింది. తొలి సునామీ అలలు వెంటనే ఉత్తర తీరాన్ని చేరుకోవచ్చని -మిగతా 2 లో

# పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం


- 15 ఏళ్లుగా అధికారంలో బెంగాల్ వెనకబాటు
- దేశ ఆర్థిక వృద్ధిలో 10 శాతంగా ఉన్న పశ్చిమబెంగాల్ టీఎంసీ అధికారంలోకి వచ్చాక 5 శాతానికి పడిపోయింది
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు



కోల్‌కతా,
పశ్చిమబెంగాల్‌లో దశాబ్దానికి పైగా టీఎంసీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాలు కేవలం 5 నుంచి 8 ఏళ్లలో అభివృద్ధి సాధించాయని, దేశ ఆర్థిక వృద్ధిలో 10 శాతంగా ఉన్న పశ్చిమబెంగాల్ టీఎంసీ అధికారంలోకి వచ్చాక 5 శాతానికి పడిపోయిందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ మార్పును -మిగతా 2 లో

# 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

- కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తే ఇదా శిక్ష
- భావోద్వేగానికి గురయిన మాజీమంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల ఏప్రిల్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మాజీ మంతంరి జీవన్ రెడ్డి తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా -మిగతా 2 లో

# భారత్-కొరియా మధ్య వాణిజ్య ఒప్పందం

## 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేరువ

- మా మధ్య సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే పునాది
- వాణిజ్య అంతరాయాలను తగ్గించుకునేలా నిర్ణయాలు
- సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం, చర్చలు ప్రారంభించడానికి అంగీకారం
- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం కలిసి పనిచేయాలని నిర్ణయం
- ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌ల మధ్య చర్చలు



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా పెరుగుతున్న వాణిజ్య అంతరాయాల నేపథ్యంలో భారత్ – దక్షిణ కొరియాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చర్చలు ప్రారంభించడానికి అంగీకరించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. -మిగతా 2 లో

# ఐపీఎల్ 2026లో ముంబై రెండో విజయం

- గుజరాత్ టైటాన్స్‌పై 99 రన్స్ తేడాతో విక్టరీ
- అజేయ సెంచరీతో సత్తాచాటిన తిలక్ వర్మ



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఐపీఎల్ 2026లో వరుస ఓటములకు ముంబై ఇండియన్స్ బ్రేక్ వేసింది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ విజయం తర్వాత వరుసగా నాలుగు మ్యాచులలో ఓడిపోయిన ముంబై.. గుజరాత్ టైటాన్స్‌తో ఘన విజయం సాధించింది. తిలక్ వర్మ అజేయ సెంచరీతో జట్టుకు భారీ స్కోరు అందించగా.. బౌలర్లు కూడా తమ పని తాము చేయడంలో విజయం సాధించారు. గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లకు కళ్లెం వేశారు. దీంతో ఐపీఎల్ 2026లో ముంబై రెండో విజయాన్ని నమోదు చేసింది. -మిగతా 2 లో

## వచ్చే 4, 5 రోజులు నిప్పుల కొలిమే

మొదటి తరువాయి

గుజరాత్ తీర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగే వాతావరణం ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. రాత్రి వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు: ఏప్రిల్ 20, 21 తేదీల్లో హర్యానా, చండీగఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల్లోనూ; ఏప్రిల్ 20-23ల్లో ఢిల్లీ, ఏప్రిల్ 20-22 మధ్య ఒడిశాలో రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండొచ్చని ఐఎండీ వెల్లడించింది. ఉరుములతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు: మరోవైపు సోమవారం నాడు దక్షిణ మధ్య కేరళ, తమిళనాడు తీరప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఏప్రిల్ 22న ఈశాన్య భారత్‌లోని అసోం, మేఘాలయా, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన వానలు పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

## విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం

మొదటి తరువాయి

ఈ మేరకు శనివారం చైన్నైలో ఇరువురి లాయర్లు కలిసి చర్చించినట్లు సమాచారం. విడిపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే సెటిల్ మెంట్ కింద ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన ఆస్తుల ఆధారంగా , తన ఇద్దరు పిల్లలు భవిష్యత్తు కోసం సుమారు రూ. 250 కోట్లు భరణం సంగీత కోరినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే విజయ్ మాత్రం సంగీతకు రూ. 35 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సమచారం. కుమారుడు, కుమార్తె బాగోగులు తాను చూసుకుంటానని విజయ్ అన్నట్లు తెలుస్తోంది. అయితే విడాకుల వ్యవహారం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోదని సమాచారం. విజయ్ నుంచి విడాకుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆమె పేర్కొన్న అంశాలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. తనను మానసిక, శారీరక వేధింపులకు గురిచేశారని, కనీస ఆర్థిక స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కదలికలపై ఆంక్షలు విధించారని, మాటలతో తీవ్రంగా కించపరిచారని ఆమె వాపోయారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. తన సొంత పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విజయ్‌కు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అయితే, సరిగ్గా ఎన్నికల ప్రచార సమయంలో ఈ విడాకుల వ్యవహారం తెరపైకి రావడం ఆయనకు ప్రతికూలంగా మారుతుందా అన్న చర్చ సాగుతోంది. మరి ఈ విడాకుల వ్యవహారం రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి మరి.

## జపాన్‌లో భారీ భూకంపం

మొదటి తరువాయి

వాతావరణ సంస్థ తెలిపింది. సునామీ అలలు పదేపదే తాకే అవకాశం ఉందని.. హెచ్చరికను ఉపసంహరించుకునే వరకు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. సంక్షోభ నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం

మొదటి తరువాయి

తీసుకురావాలని ఓటర్లను కోరారు. సోమవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు వరుసగా మూడుసార్లు టీఎంసీకి అధికారం ఇచ్చారని, 15 ఏళ్లు అంటే అదేమంత తక్కువ సమయం కాదని చెప్పారు. పశ్చిమబెంగాల్ ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారని, ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈసారి బీజేపీకి బాసటగా నిలవాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. 'భయాందోళనల మధ్య ఇక్కడి ప్రజలు కాలం నెట్టుకొస్తున్నారు. వారందరికీ ఒకటే చెప్పదలచుకున్నాను. ఈసారి మార్పు తప్పనిసరిగా రావాలి. బీజేపీకి మీరంతా అండగా నిలబడాలి' అని విజ్ఞప్తి చేశారు. మహిళా సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధానమంత్రి మోదీ స్థిరనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. 'ఇవాళ కాకపోతే, రేపు అది జరిగి తీరుతుంది' అని భరోసా ఇచ్చారు.పశ్చిమబెంగాల్‌లో బీజేపీ విజయావకాశాలపై రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని సీట్లు వస్తాయనేది చెప్పలేను కానీ, బీజేపీకి స్పష్టమైన మెజారిటీ వచ్చితీరుతుందన్నారు. మూడింట రెండు వంతుల సీట్లు ఖాయమని చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## భారత్-కొరియా మధ్య వాణిజ్య ఒప్పందం

మొదటి తరువాయి

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం కలిసి పనిచేయాలని కూడా నిశ్చయించారు. మాడ్రిడ్‌లో పర్యటన కోసం భారత్‌కు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ప్రధాని మోదీ చర్చలు జరిపారు. సెమీ కండక్టర్ తయారీ, రక్షణ రంగం, హరిత ఇంధనం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం వంటి అంశాలపై పలు ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి.

భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే పునాది అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు వాణిజ్య వాటాను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన అనేవి ఇరు దేశాల డీఎన్‌ఏలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల చర్చల అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడిన ప్రధాని, భారత్-దక్షిణ కొరియాల మైత్రి ప్రపంచానికి శాంతి, స్థిరత్వం సందేశాన్ని ఇస్తుందని మోదీ అన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత సృష్టి కోసం ఇరు దేశాల ఒకే విధమైన దృక్పథాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు.

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

మొదటి తరువాయి

ఉన్నారని తెలిపారు. జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్ తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కళ్యాణలక్ష్మి పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు.

# కల్వకుంట్ల కుటుంబానికి కాలం చెల్లింది

మొదటి తరువాయి

తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలిపార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిలోపే చేసి చూపించాం. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశాం. గత విడతలో రైతుభరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశాం. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తాం. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? అన్నారు. గతంలో వైఎస్ఆర్- డి.శ్రీనివాస్ జోడీ కాంగ్రెస్‌ను వరుసగా ఎలా గెలిపించిందో, ఇప్పుడు తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తామని ఆయన శపథం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, వారిచ్చిన తీర్పును గౌరవించకుండా కేసీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడటం ఆయన భ్రమలకు నిదర్శనమని రేవంత్ మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు 'చిల్లర మాటలు' అంటూ కొట్టిపారేసిన సీఎం, రాష్ట్ర ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమను మళ్లీ గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇకపై తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ హవా మాత్రమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి కార్యకర్తల సాక్షిగా ప్రకటించారు. విపక్షాల విమర్శలకు తాము చేసే అభివృద్ధే సమాధానం చెబుతుందని, క్షేత్రస్థాయిలో పార్టీని



మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రైతు భరోసా రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. 40 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం.. కాంగ్రెస్ నినాదమే కాదు, విధానమని ఉద్ఘాటించారు. పంటలకు గిట్టుబాటు ధర తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని నొక్కిచెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఊడగొడతామని హెచ్చరించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు ముంచారని ఆగ్రహించారు. కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదని హెచ్చరించారు. వరుస ఎన్నికల విజయంతో ఆయనకు ఘోరీ కట్టామని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందాం.. దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. ప్రజాపాలనో.. పాపాల భైరవుడో తేల్చుకుందామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఘోరీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తల సాక్షిగా ఇదే తన సవాల్ అని పేర్కొన్నారు.

ప్రజాపాలన ఎందుకు పోవాలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ 20 వేల ఇళ్లు కూడా ఎందుకు కట్టలేదని నిలదీశారు. 4.5 లక్షల ఇళ్లు ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు ప్రజాపాలన పోవాలా? అని నిలదీశారు. ప్రజాపాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్‌రెడ్డి అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు గడీల పాలన పోవాలనే కాంగ్రెస్ పాలన తెచ్చుకున్నారని ప్రస్తావించారు. జీవన్‌రెడ్డి మాజీ సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నాదెండ్లతో జతకట్టారని విమర్శించారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తలు జీవన్‌రెడ్డిని పల్లకీపై మోశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం గడీలకు ఊడిగం చేయాలా? అని ప్రశ్నించారు. గతంలో ఆడబిడ్డలు బతుకమ్మ చీరలు కట్టి పండుగ చేసుకున్నారా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. వాస్తు బాగా లేదని బాగున్న సచివాలయం కూల్చి కొత్తగా కట్టుకున్నారు. బిడ్డ, కొడుకు, తండ్రి ఇలా తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా?పేదలు.. దొరల గడీల ముందు ఊడిగం చేస్తూ అలాగే ఉండాలని భావించారు. పేదలు కట్టుకోవడానికి పనికిరాని బతుకమ్మ చీరలు పంచారు. వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి.. పదేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. కేసీఆర్.. నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో.. నేనో తేల్చుకుందాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు

మొదటి తరువాయి

కోసమే బీఆర్ఎస్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేరారని తెలిపారు. 45 ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తమకు స్నేహం ఉందని ప్రస్తావించారు. సోమవారం జగిత్యాలలో కేసీఆర్ పర్యటించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ సమక్ష్యంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు. రెండేళ్లలో ఒక్క నిర్మాణాత్మక పని కూడా కాంగ్రెస్ చేపట్టలేదన్నారు. ఉద్యమనాటి పరిస్థితులు మళ్లీ దాపరించాయని, ఎరువుల బస్తాలకు మళ్లీ క్యూలో చెప్పులు పెట్టాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కరెంట్ ఆగం అయ్యిందని, మిషన్ బగీరథ మూలన పడిందన్నారు. పెట్టిన ఇల్లులాగా ఉన్న తెలంగాణను అప్పగి÷-తే సర్వనాశనం చేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పేరు ఎక్కడా ఎత్తకుండా కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉండేవని

కెసిఆర్ వ్యాఖ్యానించారు. గతంలో తెలంగాణ పదం పలకడానికే భయపడే రోజులు ఉండేవని పేర్కొన్నారు. భిన్న రాజకీయ పార్టీల వల్లే జీవన్‌రెడ్డి, తాము వేర్వేరుగా పనిచేశామని అన్నారు. జీవన్‌రెడ్డి గుండెధైర్యంతో నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.జీవన్‌రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని వెల్లడించారు. ఆయన ప్రజాజీవితం ఎంతోమందికి ఆదర్శమని ప్రశంసించారు. జీవన్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్‌కు ఊపు వస్తోందన్నారు.జీవన్‌రెడ్డితో కలిసి అన్నదమ్ముల్లా పనిచేస్తామని వివరించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డికి తక్షణ బాధ్యతలు ఇస్తామని స్పష్టం చేశారు. కరీంనగరే కాదని.. చుట్టుపక్కల జిల్లాల్లోనూ జీవన్‌రెడ్డి పనిచేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి కీలక బాధ్యతల్లో ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణ పదాన్నే నిషేధించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. మన నీళ్లు, వనరులను దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. కొన్ని పార్టీల తీరుతో ఆవేశం, దు:ఖం వచ్చేదని చెప్పుకొచ్చారు. పాలమూరు లాంటి జిల్లాల్లో 90 శాతం వలసలే ఉన్నాయని ప్రస్తావించారు. గంజి కేంద్రాలు పెట్టిన అధ్వాన స్థితికి తెలంగాణను చేర్చారని తెలిపారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు చంద్రబాబు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. కరెంట్



ఛార్జీలపై నిరసన తెలిపితే బషీర్‌బాగ్‌లో కాల్చి చంపారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటనతోనే తెలంగాణ జెండా పట్టుకుని ఉద్యమం చేశానని ప్రస్తావించారు. బక్కపలచనోడు, ఇతనితో ఏమవుతుందని హేళన చేశారని గుర్తుచేశారు. మొక్కవోని దీక్షతో తెలంగాణ మొత్తం తిరిగి ఉద్యమించానని ఉద్ఘాటించారు. మాజీ సీఎం రోశయ్య 14ఈ జీవో తెస్తే ఉద్యోగ గర్జన చేపట్టామని ప్రస్తావించారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ దీక్ష చేపట్టానని తెలిపారు. తన దీక్షతో పార్లమెంట్ అల్లకల్లోలమైందని అన్నారు. మాజీ కేంద్రమంత్రి చిదంబరం వచ్చి తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఆంధ్రోళ్ల ఒత్తిడితో మళ్లీ అడ్డంపడితే పోరాడామని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక అందరినీ కలుపుకుని ప్రణాళికతో ముందుకెళ్లామని అన్నారు. కాకతీయ రాజుల పేరుతో చెరువులు బాగుచేసుకున్నామని తెలిపారు. పదేళ్లలో ఎన్ని చేశామో మీరే చూశారని ప్రస్తావించారు. మిషన్ భగీరథ పూర్తికాకపోతే ఓట్లు వేయొద్దని అసెంబ్లీలోనే చెప్పానని అన్నారు. ఐదేళ్లలోనే మిషన్ భగీరథ పూర్తిచేసి మంచినీళ్లు ఇచ్చామని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మిషన్ భగీరథకు ఏం రోగం పుట్టింది? అని ప్రశ్నించారు. ఇప్పుడు మిషన్ భగీరథ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ చావాలి అంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారని అన్నారు. తాను విమర్శించే వారు వెయ్యి జన్మలెత్తినా తాను చావనని తెలిపారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా అని ఎద్దేవా చేశారు. చావాలంటూ మీరు శాపాలు పెడితే తాను చస్తానా? అని ప్రశ్నించారు. చివరి శ్వాస ఉన్నంతవరకు పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పుడు తెలంగాణలో కరెంట్ వస్తోందా? అని ప్రశ్నించారు. పంటపొలాలు ఎండిపోయి ప్రజలు ఏడుస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేటప్పుడు ఉల్టాపల్టా కావొద్దని అప్పుడే చెప్పానని ప్రస్తావించారు. వీళ్లు రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీమ్ అంటారని చెప్పానని అన్నారు. ఒక్కసారే వెయ్యాల్సిన రైతుబంధును ఒక్కో ఎకరానికి ఒకసారి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో మేం ఒకేసారి రైతుబంధు వేసేవాళ్లమని చెప్పుకొచ్చారు. వీళ్లు నోటికొచ్చిన మాటలు.. ఇష్టమొచ్చిన కథలు చెప్పారని అన్నారు. వీళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని.. ఇప్పుడు గోస పడుతున్నారని చెప్పారు. 1.7 శాతం ఓట్ల తేడాతోనే మనం ఓడిపోయామని ప్రస్తావించారు. మనవాళ్లు అటూ ఇటూ దూకినా తాను ఎక్కడా మాట్లాడలేదని అన్నారు.

తాము రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎకరం రూ.2 కోట్ల నుంచి 3 కోట్లు ఉండేదని ప్రస్తావించారు. ఇప్పుడు అమ్మేవాళ్లు ఉన్నారు కానీ.. కొనేవాళ్లే లేరని చెప్పారు. యూరియా బస్తాలు కూడా ఇవ్వడం చేతకావడం లేదని మండిపడ్డారు. యాప్‌ల పేరుతో కాళ్లకు వాపులు తప్ప ఏమీ లేదని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభ పెడితేనే.. రెండోవిడత రైతుబంధు ఇస్తున్నారని తెలిపారు. మళ్లీ తాను సభ పెడితేనే మూడోవిడత రైతుబంధు ఇస్తారా..? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో హైడ్రాను తీసుకొచ్చారని.. నిజామాబాద్‌లోనూ తెస్తామని అంటున్నారని ప్రస్తావించారు. పేదల ఇళ్లను కూల్చివేయడమేనా? ఈ ప్రభుత్వ పని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తిపారేస్తామని అన్నారు. హైడ్రా ఎత్తివేతపైనే తన తొలి సంతకం ఉంటుందని స్పష్టం చేశారు. మూసీ కోసం వేల ఇళ్లు కూల్చేస్తారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని ఆరోపించారు. మూసీ సుందరీకరణ వద్దంటలేం.. కానీ.. పేదల ఇళ్లు కూల్చివేత దేనికి? అని నిలదీశారు. రైతులకు నష్టమనే మీటర్లు పెట్టేందుకు తాము ఒప్పుకోలేదని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి మోకరిల్లి మీటర్లు పెడుతున్నారని.. మీటర్ల ఏర్పాటుపై యుద్ధం చేస్తామని కేసీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఐపీఎల్ 2026లో ముంబై రెండో విజయం

మొదటి తరువాయి

తిలక్ వర్మ సూపర్ షో..

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్.. ఇన్నింగ్స్ ప్రారంభంలోనే వికెట్లు కోల్పోయింది. దానిష్ మలేవర్, క్వింటన్ డికాక్, సూర్యకుమార్ యాదవ్ స్వల్ప స్కోరుకే ఔట్ కావడంతో పవర్ ప్లే ముగిసే లోపే 3 వికెట్లు కోల్పోయింది. దీంతో మరోసారి ముంబై తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్ వర్మ అద్భుతం చేశాడు.ఈ మ్యాచ్‌లో తొలి 20 బంతుల్లో కేవలం 17 రన్స్ మాత్రమే చేసిన తిలక్.. ఆ తర్వాత విశ్వరూపం చూపించాడు. ఆ తర్వాత 23 బంతుల్లో ఏకంగా ఏకంగా 82 పరుగులు స్కోరు చేశాడు. తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 7 సిక్సులు, 8 ఫోర్లు కొట్టాడు. మొత్తంగా 45 బంతుల్లో 101 పరుగులు చేశాడు. నమన్ ధీర్ 32 బంతుల్లో 45 రన్స్ చేశాడు. దీంతో ముంబై ఇండియన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది.అనంతరం ఛేజింగ్‌కు దిగిన.. గుజరాత్ టైటాన్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. తొలి బంతికే సాయి సుదర్శన్ ఔట్ అయ్యాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క వికెట్ కూడా తీయని బుమ్రా.. ఈ మ్యాచ్‌లో మాత్రం తొలి బంతికే సుదర్శన్‌ను ఔట్ చేశాడు. జాస్ బట్లర్ (5), శుభమన్ గిల్ (14), గ్లెన్ ఫిలిప్స్ (6), రాహుల్ తెవాటియా (8) విఫలమయ్యారు. చివరకు గుజరాత్ టైటాన్స్.. 15.5 ఓవర్లలో 100 పరుగులకు ఆలౌట్ అయింది. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అశ్వనీ కుమార్.. 4 ఓవర్లు వేసి 24 పరుగులు ఇచ్చి.. 4 వికెట్లు పడగొట్టాడు. ఘజన్‌ఫర్, మిచెల్ శాంట్నర్ రెండేసి వికెట్లు తీశారు. బుమ్రా, హార్దిక్ పాండ్యా ఒక్కో వికెట్ పడగొట్టారు.

# మహిళా మణుల రాజకీయ ప్రస్థానం పై రాజకీయాల కన్నెర్ర




పాలిచ్చి పెంచిన మహిళలకు పాలించడం ఓ లెక్కనా ఇంటికి దీపం అవుతూ పనిలో దాసి అయి పరిపాలనలో మంత్రి వలె నడిపిస్తూ ప్రేమలో అమ్మ వలె వాత్సల్యాన్ని ఒలకిస్తూ పడక పై వయ్యారాలు ఒలకింపచేస్తూ రూపంలో లక్ష్మి దేవత వలె కనిపిస్తూ భూదేవికున్నంత ఓర్పుతో భర్తనే ఆది దేవునిగా భావించే మహిళా మణుల దర్శనికత్వానికి ఏమిచ్చి కొలమానం ఋణం తీర్చుకోగలం పైగా వారి పరిపాలన దక్షతకు అవసరమైన చట్ట సభలలో రాజకీయ రిజర్వేషన్ బిల్లు కి వ్యతిరేకులం అయినమే తప్ప వారి క్షేమానికి కాదు . నారీ శక్తి వందన అధినియం మహిళా రిజర్వేషన్ బిల్లు 2023 ప్రకారం లోకసభ మరియు అసెంబ్లీ లలో చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించి భారతాన్ని మహిళా మణుల సాధికారంతో సమన్వయ పరుస్తూ పరిపాలనలో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ ఉన్నత ఫలాలు అందించాలని అనేది ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు. భారత రాజ్యాంగం లోని

1)నిబంధన 81 ప్రకారం లోకసభ సభ్యుల సంఖ్యను 850 కి పెంచడం

2)330వ నిబంధన ప్రకారం లోక్ సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించడం.

3)332వ నిబంధన ప్రకారం అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించడం.

ఈ అంశాలనే దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ చట్టం అనే బిల్లును 131 వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రవేశ పెట్టింది. కానీ ఈ బిల్లు పై రాజకీయ నీలి నీడలు కమ్ముకొని మధ్యలోనే ఇ బిల్లు వీగిపోయింది.

"అసలు ఏంటి ఈ డెలిమిటేషన్?" 2026 జన గణనను ఆధారంగా చేసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ ఏర్పాటు చేసి 2029 కల్లా నియోజక వర్గాల సంఖ్యను పెంచి ఆ సంఖ్యకు అనుగుణంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సదుపాయాన్ని చట్ట సభలలో కల్పించడమే ఈ డెలిమిటేషన్ యొక్క విధానం.

**"ప్రతిపక్షాల వైఖరీ ఏంటి?"**

పాత లోక్ సభ సీట్ల ఆధారంగా 543 ప్రకారమే నియోజక వర్గ పునర్వ్యవస్థీరణ ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాల వైఖరి.

2029 కళ్ళ నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ చట్టం రూపొందించి జమిలి ఎన్నికలు నిర్వహించి ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించడం అంతిమ లక్ష్యంగాఎన్డీఏ ప్రభుత్వం యొక్క ఆలోచన .

రాజకీయ కక్ష సాధింపులతో మహిళా రిజర్వేషన్ బిల్లును తిరస్కరించడం మహిళా మణుల పై ముమ్మాటికి పక్షపాత వైఖరే.

నేటికి గ్రామ పంచాయతీ అధికారాలలో గానీ నగర పాలక సంస్థలలో గానీ 50 శాతం మేర మహిళా మణులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనప్పటికీ అధికార చలామణిలో భర్తల దే పై స్థాయిగా మనకు కనిపిస్తుంది గ్రామ పంచాయతీ అధికార చలామణిలో ముఖ్యంగా సదరు మహిళా ప్రజా ప్రతి నిధి భర్త స్వయంగా ప్రత్యక్షంగా రాజకీయ వ్యవహారాలలో పాల్గొనడం మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. దీనిపై భారత రాజ్యాంగం కఠినమైన నిబంధనలు రూపొందించిన చూసి చూడనట్టు అధికార యంత్రాంగం వ్యవహరించడం సిగ్గు వ్యవస్థ గా చెప్పుకోవచ్చు .కాలాలు మారిన రాజకీయ మాయ చదరంగంలో ప్రజలు వారి స్వార్థపు విధానాలకు పావులుగా నే మారిపోతున్నారు తప్ప రాజకీయాలని నిర్ణయించే విధంగా కాదు. పాలన వ్యవహారాలలో క్రియాశీలకంగా మారే మహిళా మణుల రిజర్వేషన్ బిల్లు పై పునరాలోచించి తగు విధి విధానాలు రూపొందించి కొన్ని వీలు అయితే సమూల మార్పులు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లు ను నియోజక వర్గ పునర్వ్యవస్థీరణ చట్టం రూపొందించి పరిపాలనలో మహిళా మణుల లో స్థానం కల్పించడం అత్యంత అవశ్యకత అంశం. నారీ శక్తులు పాలన దక్షతకు నిదర్శనం.

మీ

**గోరుపాటి శంకర్ అసోసియేట్ ఎడిటర్**
**- నీలగిరి ఎక్స్ ప్రెస్,**
**రచయిత.**



## మున్సిపల్ చైర్‌పర్సన్ చొరవతో పట్టణ రహదారుల శుభ్రతకు 'స్వీపింగ్ మెషిన్' పునఃప్రారంభం



**దేవరకొండ ఏప్రిల్ 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారులను శుభ్రపరిచే 'స్వీపింగ్ మెషిన్' సోమవారం నుండి తిరిగి రోడ్డెక్కింది. గత కొంతకాలంగా వినియోగంలో లేని ఈ యంత్రాన్ని, పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఆమె మళ్ళీ అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ...ప్రధాన రహదారులపై పేరుకుపోయిన ధూళి, చెత్తను వేగంగా తొలగించడానికి ఈ మెషిన్ ఎంతో దోహదపడుతుంది.రోడ్ల శుభ్రతకు యంత్రాన్ని వాడటం వల్ల, అక్కడ పనిచేసే పారిశుద్ధ్య సిబ్బందిని ఇతర వార్డుల్లోని అంతర్గత వీధుల శుభ్రతకు కేటాయించే అవకాశం ఉంటుంది. దీనివల్ల పట్టణమంతా ఏకకాలంలో పరిశుభ్రంగా మారుతుంది.అందుబాటులో ఉన్న అన్ని వనరులను, సాంకేతికతను ఉపయోగించుకుంటూ పట్టణాన్ని ఆదర్శవంతంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే మా ప్రథమ ప్రాధాన్యత.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ గౌడ్, గుత్తే జవాన్లు మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## సిమెంట్ పంపిణీ చేసిన మాలే రవీందర్ రెడ్డి



**తలకొండపల్లి, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చీపునుంతల గ్రామంలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేయలేని కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుడు మాలే రవీందర్ రెడ్డి సహకారంతో సిమెంట్ బస్తాలు పంపిణీ చేశారు.ఈ సహాయం పొందిన కుటుంబాలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, మాజీ సర్పంచ్ బండి రఘుపతి, నాయకులు పెంటయ్య, పార్వతలు, చెన్నయ్య, వెంకట్ రెడ్డి, శ్రీశైలం, వేణు, బిక్షపతి, రామకిష్టయ్య, మల్లయ్య, గుమ్మడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నీలగిరి ఎక్స్ప్రెస్ చెరువతో తీరిన గణేష్ నగర్ చెత్త, డ్రైనేజీ సమస్య







**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని గణేష్ నగర్ 57వ డివిజన్‌లో చెత్త, డ్రైనేజీ సమస్యపై నీలగిరి ఎక్స్‌ప్రెస్‌లో ఏప్రిల్ 19న వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు.57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్ ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యను త్వరగా పరిష్కరించడంలో చొరవ చూపిన నీలగిరి ఎక్స్‌ప్రెస్ బృందానికి, కార్పొరేటర్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## షాద్‌నగర్ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ




**షాద్‌నగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్షయ తృతీయ, బసవ జయంతి సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.సామాజిక కార్యకర్త నీల రవీందర్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందే సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని, వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చే ఈ సేవా గుణాన్ని అభినందించారు.క్లబ్ అధ్యక్షుడు గుంత సత్యనారాయణ, కార్యదర్శి జవాద యశ్వంత్ రాజ్, కోశాధికారి సోమ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రయాణికులకు పెద్ద ఎత్తున మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, వాసవి క్లబ్ నాయకులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ గుంత




**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా మార్కెట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింది. మురుగు నీరు బయటకు రావడంతో రహదారి అస్తవ్యస్తంగా మారి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అదేవిధంగా మార్కెట్‌లోని వెంకటేశ్వర స్వామి గుడి వద్ద వాషింగ్ ఏరియాలో డ్రైనేజీ నీరు సరిగా వెళ్లక చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. డ్రైనేజీ ఛాంబర్ తెరిచి ఉండటంతో భక్తులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.స్థానిక ప్రజలు, భక్తులు మున్సిపల్ అధికారులు, సంబంధిత కార్పొరేటర్ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కడ్తాల్ పట్టణ కేంద్రంలో బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయంతి వేడుకల్లో ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సర్వేశ విష్ణువర్ధన్ పాల్గొన్ని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో కులాలను, మతాలను రూపుమాపేందుకు తొలి అడుగు వేసిన మొట్టమొదటి సంఘసంస్కర్త బసవేశ్వరుడు అన్నారు.

## ప్రకాశ్ రాజ్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్



**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హిందూ దేవతామూర్తులపై అసభ్య వ్యాఖ్యలు చేసి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్న సినీ నటుడు ప్రకాశ్ రాజ్పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ కార్యకర్తలు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని కలసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్, నాయకులు వారధి శీను, పర్వతాలు, రాజేశ్వర్ రెడ్డి, శోభన్ బాబు, బాలస్వామి సత్యనారాయణ, గణేష్, దిలీప్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కిషోర్, బచ్చయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, "ప్రకాశ్ రాజ్ హిందూ దేవతలను అవమానిస్తూ, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నాడు. ఇట్టి వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

# మర్రిగూడలో సీతారాముల ఆలయ శంకుస్థాపన



**మర్రిగూడ, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో సీతారాముల ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది.వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నవగ్రహ, వాస్తు పూజలు, హోమం నిర్వహించారు. సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్, గుమ్మకొండ విఠల్ రెడ్డి దంపతులు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి గ్రామ పెద్దలు, భక్తులు ధన--వస్తు రూపంలో సహకరించాలని కోరారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొందుర్గు పీహెచ్‌సీపై ఎమ్మెల్యే ఆగ్రహం



**కొందుర్గు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణలో నిర్లక్ష్యం సహించేది లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఆకస్మికంగా కొందుర్గు పీహెచ్‌సీని తనిఖీ చేసి అస్తవ్యస్త పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.తనిఖీలో 19 మంది సిబ్బందిలో కేవలం 5 మంది మాత్రమే విధుల్లో ఉండటం, అక్రమ డిప్యూటేషన్లు, రోజువారీ ఓపీ సంఖ్య తగ్గిపోవడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డిప్యూటేషన్ రద్దు చేయాలని ఆదేశించారు.జిల్లా వైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదించి, రెండు రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని, నిర్లక్ష్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి, స్థానిక ఎస్సై రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సోమ కిరణ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగంలో సోమ కిరణ్ కుమార్ "టీచర్ లైబ్రేరియన్షిప్: ఏ స్టేట్ ఆఫ్ ఆర్ట్ స్టడీ" అంశంపై చేసిన పరిశోధనకు పిహెచ్‌డీ డాక్టరేట్ అవార్డు లభించింది.డాక్టర్ ఆర్‌కే పవన్ కుమార్, డాక్టర్ ఏఎస్ చక్రవర్తి పర్యవేక్షణలో పూర్తి చేసిన ఈ పరిశోధనలో తెలంగాణ రాష్ట్రంలోని అంతర్జాతీయ కే 12 పాఠశాలల్లో టీచర్ లైబ్రేరియన్ల అవసరం, మౌలిక వసతులు, గ్రంథాలయ వినియోగం, అభివృద్ధి సూచనలు వివరించారు.సోమ కిరణ్ తన పరిశోధనకు సహకరించిన విభాగాధ్యక్షుడు డాక్టర్ వివేకవర్ధన్, అధ్యాపకులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆలయ పునర్నిర్మాణానికి సర్పంచ్ కుటుంబం విరాళం



**వెల్దండ, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ రూ.51 వేల విరాళం అందజేశారు.ఆలయ కమిటీ సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలసి సహకారం కోరగా, సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, యువజన నాయకులు, గ్రామస్థులు పాల్గొని సర్పంచ్ సహకారాన్ని అభినందించారు.

# కాకతీయ నగర్ బస్తీలో ఘనంగా హిందూ సమ్మేళనం










**నేరేడ్మెట్, ఏప్రిల్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాకతీయ నగర్ బస్తీలో ఆదివారం రాత్రి జరిగిన హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ ధర్మ జాగరణ సమన్వయకర్త శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షురాలు డా. సునీత రామ్మోహన్, వేదపాఠశాల ఆచార్యుడు మల్లికార్జున స్వామి ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ హిందువుల ఐక్యత అవసరమని, కులాలకతీతంగా సమాజం ఏకమై ధర్మ రక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మంలో మహిళలను శక్తిగా కొలుస్తారని, గోమాత, గంగామాత వంటి ఆరాధన ఉదాహరణలు వివరించారు.కూచిపూడి, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాల హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాక్టర్ల ర్యాలీతో దద్దరిల్లిన మహేశ్వరం




**మహేశ్వరం, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఏప్రిల్ 25న మేడ్చల్ వేదికగా జరగబోయే కవిత నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభకు మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గంలో రైతుల భారీ ట్రాక్టర్ల ర్యాలీ జరిగింది.యువజన నాయకుడు కర్నాటి చంద్రకాంత్ నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంచాల వరలక్ష్మి, కోళ శ్రీనివాస్, జిల్లా ఇన్చార్జ్ తాండ్ర శ్రీనివాసరావు, రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.నాయకులు మాట్లాడుతూ, "ప్రశ్నించు -- పోరాడు -- పరిష్కరించు" నినాదంతో కవిత అడుగులు సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల సాధికారత, సర్వోదయ తెలంగాణ కోసం వేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వేదభవాని, కటికల కోటేశ్వర్, రాయకంటి జగన్, కప్పాటి శివరామకృష్ణా రెడ్డితో పాటు భారీ సంఖ్యలో రైతులు, యువకులు, జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీ పొడవునా వినిపించిన నినాదాలతో మహేశ్వరం మార్మోగింది.

# డిగ్రీ కళాశాల బ్రోచర్ విడుదల చేసిన ఎమ్మెల్యే



**ఆమనగల్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి కోట్ల నిధులు మంజూరు చేస్తోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్న ఆమనగల్ కళాశాలలో తలకొండపల్లి, కడ్తల్, మాడుగుల, ఆమనగల్ ప్రాంతాల విద్యార్థులు అడ్మిషన్ పొందాలి" అని సూచించారు.ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీపాద శర్వాణి మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఏప్రిల్ 15 నుండి మే 7 వరకు ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వెబ్ ఆప్షన్లు ఏప్రిల్ 30 నుండి మే 8 వరకు, సీట్ల కేటాయింపు మే 14న, సెల్ఫ్ రిపోర్టింగ్ మే 15 నుండి 23 వరకు ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి. జగదీశ్వర్ రెడ్డి, అధ్యాపక బృందం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మానవత్వమేమతం, బసవన్న బాటే మార్గం

- ఎమ్మెల్యే వీర్లపల్లి



**షాద్‌నగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహాత్మా బసవేశ్వరుడు కులమతాలకు అతీతంగా సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన గొప్ప సంస్కర్త అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.మల్లికార్జున కాలనీలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో జరిగిన 893వ బసవేశ్వర జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్తో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, "బసవన్న లింగ వివక్ష, కుల వ్యవస్థను వ్యతిరేకించి సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఆయన బోధనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వీరశైవ సమాజ నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల మధ్య ప్రసాద వితరణ జరిగింది.

# కవిత నూతన రాజకీయ ప్రస్థానం విజయవంతం కావాలి



**మహేశ్వరం, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడ్చల్‌లో ఈనెల 25న ప్రకటించబోయే కవిత నూతన రాజకీయ పార్టీ ప్రజాదరణ పొంది విజయవంతం కావాలని కోరుతూ మహేశ్వరం శివగంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాగృతి యువజన నాయకుడు కర్నాటి చంద్రకాంత్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచాల వరలక్ష్మి, కోల శ్రీనివాస్, జిల్లా ఇంచార్జ్ తాండ్ర శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.నమక చమకాలు, పంచామృతాభిషేకం, బిల్వార్చనలతో స్వామివారిని ప్రార్థిస్తూ, కవితక్క అడుగులు తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

# ప్రారంభమైన మొక్కజొన్న, ధాన్యపు కొనుగోలు కేంద్రాలు

**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో, కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించి రైతుల కోసం సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడిని ప్రోత్సహించిన ప్రభుత్వం, మొక్కజొన్న కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించడం తగదని విమర్శించారు. ఎకరాకు 35--40 క్వింటాళ్లు దిగుబడి వస్తున్నప్పటికీ, ప్రభుత్వం 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుందని, మిగతా ధాన్యం దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని



ఆయన డిమాండ్ చేశారు.కరీంనగర్ నగరంలోని 16వ డివిజన్‌లో మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో కలిసి వరి కొనుగోలు కేంద్రాన్ని కూడా గంగుల కమలాకర్ ప్రారంభించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం మలిచేరు తండా గ్రామపంచాయతీ పరిధిలో ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ గుగులోత్ మహేందర్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విటల్, వార్డు సభ్యులు సంపత్, రజిత, కవిత, కొమరం సుమన్, పరమేష్, రమేష్, శారదతో పాటు గ్రామ పెద్దలు రంగానాయక్, కైలా నాయక్, మున్నా నాయక్ తదితరులు పాల్గొన్నారు.జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ కొనుగోలు కేంద్రాలు రైతులకు ఉపశమనం కలిగించనున్నాయి.

## మంచినీటి సమస్యను తీర్చిన సర్పంచ్



**వెల్దండ, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దాపురం గ్రామంలో మంచినీటి సమస్యను సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ పరిష్కరించారు. 1వ వార్డులో నీటి సమస్యను తీర్చడంతో పాటు, గ్రామ పంచాయతీ ఆవరణంలో మహిళా అధికారులు, ఆశ వర్కర్లు, గ్రామస్తుల కోసం కొత్త బాత్రూం నిర్మించి సోమవారం అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్ చారి, కార్యదర్శి మాధవి, వార్డు సభ్యులు జక్కుల మల్లేష్ యాదవ్, గంగపురం రమేష్, నిరంజన్, శ్రీధర్ గౌడ్, మమత అనిల్, తిరుపతి, లలిత మల్లయ్య, అంజయ్య, రజిని జానీతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా హిందూ సమ్మేళనం

**తిమ్మాపూర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ ఉపమండలంలో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా మాతృభూమి సేవ, సమాజ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కోసం ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విభాగాలు కూడా తమ తమ రంగాల్లో పనిచేస్తున్నాయని చెప్పారు.సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా హిందూ సమ్మేళనాలు విజయవంతంగా జరుగుతున్నాయని, ఐకమత్యం, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ ఆచరణ, పౌర బాధ్యత నియమాలు అనే ఐదు అంశాలను





ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమం కొనసాగుతోందని వివరించారు. హిందూ సమాజం ఐక్యంగా ఉంటేనే దేశం ధర్మం సుస్థిరంగా ఉంటుందని, విభజనతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రాంత సేవికా సమితి శారీరక్ ప్రముక్ లెక్కల రమాదేవి, జిట్స్ వేద పాఠశాల ప్రధానాచార్యులు కళకుట్ల వరప్రసాద్ మాట్లాడుతూ హిందూ ధర్మం పురాతనమైనదని, దాని పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. యువత చెడు మార్గాలను అనుసరించకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు కిషన్, సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పూల్లూరి రామారావు, ఖండ కార్యవాహ ఆవుల కుమార్, ఉపమండల ప్రముఖ్ కన్నం సాయి, తిమ్మాపూర్ ఉపమండలంలోని ఎనిమిది గ్రామాల హిందూ బంధువులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, జెడ్పీ సీఈవో దేవ సహాయం, ఏవో చంద్రశేఖర్తో కలిసి ప్రజల వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉంది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి" అని స్పష్టం చేశారు.ప్రజావాణిలో 45 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సంబంధిత శాఖలు పరిశీలించి వారంలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలు



**వేములవాడ, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాలను ముస్తాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రారంభించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి కిచెన్ అండ్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించి, కిచెన్, డైనింగ్ హాల్, ఫ్రీజర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి

**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గొప్ప సంఘసంస్కర్త బసవేశ్వరుడు



వందల ఏళ్ల కిందటే కుల, లింగ, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలకు చైతన్యం కలిగించారని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యను నమ్ముకుని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి అనిల్ ప్రకాష్, వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్య, 9వ డివిజన్ కార్పొరేటర్ పడిశెట్టి వసంత లక్ష్మి, లుక్క రాజేశం, గాజుల స్వప్న, కరుణాకర్, అంజయ్య, ఆంజనేయులు, బాకం సంతోష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు కలిసి బసవేశ్వరుడి బోధనలను స్మరించుకున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి



**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవోలు రమేష్ బాబు, మహేశ్వర్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 238 దరఖాస్తులు అందగా, అందులో అత్యధికంగా కరీంనగర్ నగరపాలిక సంస్థ నుంచి 59 దరఖాస్తులు వచ్చాయి. వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను పరిశీలించారు.

## మహాత్మ బసవేశ్వరుని ఆశయాలే నిజమైన నివాళి



**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన బసవేశ్వర జయంతి వేడుకలకు కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ కుచ్చుకుళ్ళ రాజేష్ రెడ్డి హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.కలెక్టర్ మాట్లాడుతూ, "బసవేశ్వరుడు కుల, మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది. ఆయన బోధనలు మానవతా విలువలను ఆచరణలో పెట్టాలని సూచిస్తున్నాయి. ఆ మార్గంలో నడవడమే నిజమైన నివాళి" అని పేర్కొన్నారు.ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, "బసవన్న మూఢనమ్మకాలపై పోరాడిన ప్రథమ సంఘసంస్కర్త. అణగారిన వర్గాల అభ్యున్నతికి మార్గదర్శకుడు. ఆయన చూపిన బాటలో నడవడం మనందరి బాధ్యత" అని అన్నారు.లింగాయత్ సంఘ నాయకులు పట్టణంలో బసవేశ్వర విగ్రహం, భవన ఏర్పాటుకు విజ్ఞప్తి చేయగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో యాదిలాల్

**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలుగు దేశం పార్టీ రాష్ట్ర నాయకులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. సోమవారం హైదరాబాద్ లోని ఎన్టిఆర్ ట్రస్ట్ భవన్ లో జరిగిన చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకల్లో నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొని పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడుకు జన్మదిన శు భాకాంక్షలు తెల్పినట్లు ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు జూబ్లీహిల్స్ లోని తిరుమల



తిరుపతి దేవస్థానంలో పార్టీ శ్రేణులతో కలిసి చంద్రబాబు నాయుడు జన్మదిన ఉత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ క్షేమంగా, ప్రజలకు ఆయన అవసరం ఎంతో



ఉందని ఆకాంక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు అర్థం నర్సింహ, కండె సత్యనారాయణ, ఎన్.టి పంచాక్షరీ, ఎన్.టి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల సమస్యలపై నిరసన

**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు, ప్లంబర్ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, ప్రతి కార్మికునికి రెండు జతల యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. యూనియన్ అధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ 250 మంది కార్మికులకు ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలని అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, బడ్జెట్ ఉన్నా వేతనాలు ఇవ్వడం లేదని



విమర్శించారు. గత నాలుగేళ్ల క్రితం ఇచ్చిన యూనిఫాం ఇప్పుడు చినిగిపోయి ఉపయోగించలేని స్థితిలో ఉందని, కొత్త యూనిఫాం, ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, కార్మికుల జీతాలను నేరుగా ప్రభుత్వమే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. మహిళా కార్మికులకు ప్రసూతి వేతనం, కార్మికులకు ఇఎస్ఐ హెల్త్ కార్డులు, కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి. అరుణ్, కార్మికులు రాజు, అరుణ, సలీం, శంకరమ్మ, తిరుపతి, రాజయ్య, మల్లయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి చెరువు పునరుజ్జీవన పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ 2.0 పథకంలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తపల్లి చెరువు పునరుజ్జీవన పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 314.60 లక్షలుగా నిర్ణయించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, వాసలా రమేష్, వేముల కవిత చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు, అధికారులు హాజరయ్యారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కొత్తపల్లి చెరువు పరిసరాలు మెరుగుపడటంతో పాటు కరీంనగర్ ప్రజలకు స్వచ్ఛమైన నీటి వనరుగా అందుబాటులోకి రానుంది.

# శిశుమందిర్ అభివృద్ధికి సహకారం



**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలపై వివరించడానికి పాఠశాల ప్రతినిధుల బృందం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుదల వంటి అంశాలను వివరించారు. శిశుమందిర్ పాఠశాలలు మెరుగైన విద్యతో పాటు సద్గుణాలు, సంస్కారాలను పెంపొందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి ప్రశంసించారు. తాను కూడా శిశుమందిర్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొంటూ, శిశుమందిర్ పాఠశాలల బలోపేతం దేశ నిర్మాణానికి శుభసూచకమని అభిప్రాయపడ్డారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**గంగాధర, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్‌లో హాక ఫార్మర్స్ సర్వీస్ సెంటర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల మాదిరిగానే హాక సర్వీస్ సెంటర్ ద్వారా కూడా రైతులకు అవసరమైన వ్యవసాయ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రైతులు ఈ సెంటర్లను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచ్లు కాదరి రేణుక, కనుకయ్య, వేముల భాస్కర్, రెండ్ల శ్రీనివాస్, బాస వేణి శ్రీనివాస్, తూం రాజు, సత్తు కనుకయ్య, సాగి అజయ్ రావు, మేర్జ కొండయ్య, ప్రేమ్ కుమార్, మంత్రి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**గుంతకల్లు ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అస్వస్థతకు గురై, చిన్నపాటి శాస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ జనసేన పార్టీ గుంతకల్లు, తాడిపత్రి తదితర నియోజకవర్గాల సమన్వయకర్తలు వాసగిరి మణికంఠ, కదిరి శ్రీకాంత్ రెడ్డిలు సోమవారం బళ్లారి దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఎన్ టి, వెన్నెముక సంబంధిత సమస్యతో శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ ప్రజల్లోకి రావాలని కోరారు. అందరి కష్టాలు తీర్చే ఆ దుర్గమ్మ వారి ఆశీస్సులు పవన్ కళ్యాణ్ పై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు ఇన్చార్జిలను ప్రత్యేకంగా ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలి



**హుస్నాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సమాచార హక్కు చట్ట సాధన కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల అమలు, ఫీజుల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉచిత మరియు తప్పనిసరి విద్య హక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కనీసం 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించడం చట్టబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. అయితే సిద్దిపేట జిల్లాలో అనేక పాఠశాలలు ఈ నిబంధనను అమలు చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు విద్య హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేయడం, రసీదులు ఇవ్వకపోవడం, అనవసర రుసుములు విధించడం వంటి సమస్యలు తల్లిదండ్రులకు భారమవుతున్నాయని వారు తెలిపారు. జిల్లా పరిపాలన తక్షణమే చర్యలు తీసుకుని, ఉచిత సీట్ల అమలును కఠినంగా పర్యవేక్షించాలని, నిబంధనలు పాటించని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం. జితేందర్ రెడ్డి, ఇంచార్జి వి. మహేందర్, కార్యదర్శి ఆర్. రాజు, సభ్యులు జీ. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కే. దినేష్, కోహెడ మండల కార్యదర్శి జీ. సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యా వ్యవస్థలో సమానత్వాన్ని కాపాడాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

# లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం

**-ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయమని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి లయన్ ఐ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు విజన్ సెంటర్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము లతో కలిసి ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అనే విధంగా లయన్స్ క్లబ్ పేదల కోసం అనేక కార్యక్రమాలు చేస్తోందని, ఉచితంగా అవయవాల పంపిణీ, కంటి చికిత్సలు, స్కూళ్లలో పుస్తకాల పంపిణీ, రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరింతగా సేవలు విస్తృతం చేయాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ 137 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 31 మందికి ఐఓఎల్ ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్ హాస్పిటల్ తరలించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారాం రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు సుధీర్ రెడ్డి, జంగయ్య, కొండల్ రెడ్డి, కొరివి వెంకటయ్య, రాములు, అల్లాజీ గౌడ్, పీఆర్ఓ పాషా, శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

# సెలవు రోజు ప్రజలకు అందుబాటులో ఎర్లీ బర్డ్ స్కీమ్



**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎర్లీ బర్డ్ స్కీమ్ కరీంనగర్ నగర ప్రజలకు సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు ఏప్రిల్ 1 నుండి 30లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందని అధికారులు తెలిపారు. పన్నులు చెల్లించడానికి భారీగా ప్రజలు రావడంతో మున్సిపల్ కార్యాలయం కిక్కిరిసింది. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా అధికారులు కార్యాలయ ఆవరణలోని గార్డెన్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పన్నులు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయానికి రావలేని వారు సంబంధిత వార్డు ఆఫీసర్, ఈ-సేవ, మీ-సేవ లేదా ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని మేయర్, కమిషనర్ సూచించారు.

# యువతలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం

**కరీంనగర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పట్టణంలోని టవర్ సర్కిల్ వద్ద పెళ్లి సీజన్ సందడి మధ్య యువత ప్రీ వెడ్డింగ్ షూట్ కార్యక్రమాల్లో పాశ్చాత్య సంస్కృతిని ఎంచుకుంటున్నారు. కాబోయే వధూవరులు తమ తల్లిదండ్రులు, పెద్దల సమక్షంలో కెమెరామెన్‌లతో ఫోటోలు, వీడియోలు



చిత్రీకరించుకుంటూ ప్రత్యేక వాతావరణాన్ని సృష్టించారు. రాజీవ్ చౌక్ పరిసర ప్రాంతాలు ఈ షూట్‌లతో కిక్కిరిసిపోయాయి. మార్కెట్ ప్రాంతానికి వచ్చిన ప్రజలు, వాహనదారులు ఈ కొత్త తరహా వేడుకలను చూసి తమ పిల్లల పెళ్లిళ్లను కూడా ఇలాగే అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆలోచనలో పడ్డారని తెలిపారు. పట్టణంలో పెళ్లి సీజన్ ఉత్సాహం, యువతలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

## వ్యవసాయ మార్కెట్లో ప్రైవేట్ ట్రేడర్ల హవా

# కొనసాగుతోందన్న ఆరోపణలు

**హుస్నాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న వ్యాపారస్తుల హవా కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కన్నపేట మండల రైతుల వద్ద మొక్కజొన్నను ప్రైవేట్ ట్రేడర్లు తక్కువ ధరలకు కొనుగోలు చేసి, బినామీ రైతుల పేర్లతో నమోదు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు ఈ వ్యవహారంలో సహకరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతుండగా, మార్కెట్లో సరైన సదుపాయాలు లేకపోవడం, వడబోత యంత్రాలు సరిగా పనిచేయకపోవడం రైతుల ఆవేదనను పెంచుతోంది. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ పట్టణంలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక వ్యవసాయ మార్కెట్‌ను వచ్చే ఏడాదిలో ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



పార్టీ తరపున కోరుతున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ తెలిపారు. రైతులపై జరుగుతున్న దోపిడీపై సమగ్ర విచారణ జరిపి సంబంధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే

# ధాన్యం విక్రయించాలి



**హుస్నాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఐకెపి, ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ జంగపల్లి ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ ధరలకు ధాన్యం అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2389, 'బి' గ్రేడ్ ధాన్యానికి రూ. 2369 మద్దతు ధర లభిస్తుందని, ఎలాంటి కోతలు లేకుండా రైతులకు న్యాయం చేస్తూ కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు శివయ్య, ఏపీఎం సురేందర్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్, వివో మండల అధ్యక్షురాలు అశ్విని, సర్పంచ్లు, మార్కెట్ డైరెక్టర్ త్రిమూర్తి, సీసీలు శివ, రాజేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ సభకు తరలి వెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు



కెసిఆర్ సభకు తరలిన బిఆర్ఎస్ శ్రేణులు.



**ఎలిగేడు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జగిత్యాల వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బిఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసింది. ఈ సభకు మద్దతుగా ఎలిగేడు మండలంలోని అన్ని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు తరలి వెళ్లారు. మండల అధ్యక్షుడు బైరెడ్డి రామ్ రెడ్డి



మాట్లాడుతూ, "భవిష్యత్తులో రానున్నది కేసీఆర్ ప్రభుత్వమే" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాపయ్య, విద్యార్థి సంఘం అధ్యక్షుడు బాసంపల్లి వినోద్, నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి రాజేశం, న్యాతరిపోచాలు, సత్యం, కవ్వంపల్లి నారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పట్టివేత

**- కేసు నమోదు చేసిన ఎస్ఐ బాలకృష్ణ**

**దేవరకొండ ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో ఆదివారం నాడు రాత్రి వేళలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టరును డిండి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చెయనైనది అని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. రాత్రి వేళలో ఎవరైనా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని అన్నారు.




# సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

నిరుపేదల సొంతింటి కలను తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలంలోని అకుతోటపల్లి గ్రామంలో లబ్ధిదారు ఇందిరమ్మ అశోక్ గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా సోమవారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దశాబ్ద కాలం తర్వాత నివాసం లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం హర్షనీయమని అన్నారు. గత ప్రభుత్వ



పాలకుల నిర్వాకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. అర్హులైన లబ్దిదారులు ఇళ్లు రాలేదని బాధపడాల్సిన అవసరం లేదని, త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సర్పంచ్ నరేందర్ రెడ్డి, ఎంపీడీఓ కుసుమ మాధురి, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, కాలే మల్లయ్య, మెకానిక్ బాబా, విజయ్ నాయక్, అండేకార్ రాజు, షఫీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కుమార్ గౌడ్, విజయ్, సమీర్, బుచ్చం తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి గ్రామస్తుల ఆర్థిక చేయూత



**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విఠాయిపల్లి గ్రామానికి చెందిన ఊరటి మల్లయ్య కుటుంబానికి గ్రామస్తులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. మల్లయ్య సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఆ కుటుంబానికి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం చేసి అండగా నిలవాలని స్థానికులు నిర్ణయించారు. దీంతో గ్రామస్థులు, మిత్రులు 72 వేలు మరియు ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము 4వేలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ 3 వేల రూపాయలు విరాళాలు పోగు చేసి 78 వేల రూపాయలను సొమ్మును బాధిత కుటుంబానికి అందజేశారు. సహాయం అందించిన గ్రామస్తులకు, పాపిశెట్టి రాము, ఉప్పల వెంకటేష్ లకు మృతుడు మల్లయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## చిట్ ఫండ్ పేరుతో ప్రజలను

# మోసం చేసిన మహిళ అరెస్ట్

**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (2నీలగిరి ఎక్స్ ప్రెస్):**



చీట్టిల పేరుతో ప్రజలను మోసం చేసి డబ్బులు అక్రమంగా వసూలు చేసిన మహిళను ఆమనగల్లు పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది. కేసు వివరాల్లోకి వెళితే నిందితురాలు లాకుమారపు లావణ్య ఆదర్శనగర్ కాలనీ, ఆమనగల్లు, అనే మహిళా చీట్టిల వ్యాపారం చేస్తూ ప్రజలను ఆకర్షించి, అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి పలువురి వద్ద నుండి డబ్బులు వసూలు చేసి ఎత్తుకున్న చిట్టీ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినట్టు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు నిందితురాలిపై ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితురాలి అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, మోసం చేసినట్లు ఒప్పుకొనగా, నిందితురాలి వద్ద నుండి సంబంధిత పత్రాలు మరియు రిజిస్టర్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. మరియు ప్రజలు ఇలాంటి చీట్టిలలో పెట్టుబడి పెట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, సీఐ వెంకటేశ్వర్లు కోరారు.

# కంపోస్ట్ యార్డును సందర్శించిన మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్

**గుంతకల్లు, ఏప్రిల్ 20 (2నీలగిరి ఎక్స్ ప్రెస్):**



స్థానిక మున్సిపల్ కంపోస్ట్ యార్డును సోమవారం గుంతకల్లు ఆర్డీ ఓ, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ సోమవారం మున్సిపల్ కంపోస్ట్ యార్డును ను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర ఆర్ ఆర్ ప్రోగ్రామ్" (రెడ్యూస్, రెజ్యూ, రీసైకిల్ తగ్గించడం, పునర్వినియోగం, పునరుద్ధరణ) ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని స్థానిక ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి స్పెషల్ ఆఫీసర్ కు తెలియజేశారు. రాష్ట్రంలో చెత్తను తగ్గించడం, వ్యర్థ పదార్థాల నిర్వహణకై పాత వ్యర్థాలను కేంద్రాలకు తెచ్చి అనంతరం తాడిపత్రి నందు గల అల్ట్రా టెక్ సిమెంట్ కు తరలించడం జరుగుతుందని తెలియజేశారు.

# నేడు రక్తదాన శిబిరం

**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నేడు (మంగళవారం) తలకొండపల్లి మండలం దేవుని పడకల్ లోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్లో రక్తదాన శిబిరం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, పీఆర్ఓ ఎంఏ పాషా లు సోమవారం తెలిపారు. శిబిరంలో ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయాలని వారు కోరారు. రక్తదానం చేసి మరొకరికి ప్రాణ దాతలు కావాలని ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు యువతకు పిలుపునిచ్చారు.

# ట్రంప్ చెబితే.. మోదీ ఇజ్రాయెల్ వెళ్లారు




**తూత్తుకుడి,,ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లే ప్రధాని మోదీ ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తమిళనాడులోని తూత్తుకుడిలో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ ఆదేశాల ప్రకారమే మోదీ ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లినట్లు తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు అకస్మాత్తుగా ఇరాన్‌పై అటాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ ఘటనకు మూడు రోజుల ముందే ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆయన నెతన్యహూతో భేటీ అయ్యారు. ఈ అంశాన్ని రాహుల్ గాంధీ తన ఎన్నికల ప్రచార ప్రసంగంలో ప్రస్తావించారు. ఒకవేళ ట్రంప్ దూకమంటే, మోదీ దూకేస్తారని అన్నారు. ఇరాన్‌లో వార్ ప్రారంభంకావడానికి ముందు ట్రంప్ ఆదేశాల ప్రకారం మోదీ ఇజ్రాయెల్ వెళ్లి వచ్చారని, దానికి కారణం చాలా సింపుల్ అని, ఎప్‌స్టీన్ ఫైల్స్.. అదానీ అని రాహుల్ ఆరోపించారు.

# స్టాలిన్ ను కలిసి కేజ్రీవాల్



**చెన్నై : ,ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోమవారం తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ను కలిశారు. ఈ సందర్భంగా స్టాలిన్ చేపట్టిన విద్య, ఆరోగ్యసంరక్షణ, మహిళల సాధికారతకు సంబంధించి కీలక రంగాల్లో ప్రభుత్వం చేస్తున్న కృషిని కేజ్రీవాల్ స్టాలిన్ ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు చేశారు. 'తమిళనాడు ముఖ్యమంత్రి తిరు ఎం.కె స్టాలిన్ ను కలవడం గౌరవంగా ఉంది. విద్య, ఆరోగ్య సంరక్షణ, మహిళా సాధికారత విషయాలలో మా ఇద్దరికీ ఒకే విధమైన దృక్పథం ఉంది. మేము ఎల్లప్పుడూ ఒకరి నుండి ఒకరు నేర్చుకుంటూనే ఉన్నాము. తమిళనాడు ప్రజల జీవితాలను మార్చడంలో ఆయన అంకితభావంతో చేస్తున్న పాలనను నేను ఎంతగానో అభినందిస్తున్నాను- అని కేజ్రీవాల్ పోస్ట్ లో పేర్కొన్నారు.

# చెట్టును ఢీకొట్టి.. కొండపై కూలిన ప్రైవేట్ జెట్ విమానం



**రాయ్‌పూర్ ,ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఒక ప్రైవేట్ జెట్ విమానం చెట్టును ఢీకొట్టింది. అదుపుతప్పిన అది కొండపై కూలింది. సంఘటనా స్థలంలో మంటలు, పొగలు కనిపించాయి. పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు ఛత్తీస్‌గఢ్‌లోని జష్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం జష్‌పూర్ -- నారాయణ్‌పూర్ అటవీ ప్రాంతంపై తక్కువ ఎత్తులో ఎగురుతున్న ప్రైవేట్ జెట్ విమానం ఒక చెట్టును ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ విమానం కొండ వాలుపై కూలిపోయింది. దీంతో మంటలు, పొగలు కనిపించాయి.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిన చార్టడ్ విమానంలోని పైలట్, కో పైలట్ మరణించినట్లు గుర్తించారు. ఈ విమానం కూలిన సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# వామపక్షాలను గెలిపించండి

## సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం



**కోల్‌కతా,,ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో వామపక్షాలను గెలిపించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం ప్రజలను కోరారు. సోమవారం నాడు మాల్దా జిల్లాలోని హరీష్‌చంద్రపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో లెఫ్ట్ ఫ్రంట్ నిర్వహించిన భారీ ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బిజెపి, టిఎంసిలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష పార్టీలు ప్రజా అనుకూల విధానాలను ప్రజల ముందు ఉంచాయన్నారు. సిపిఎం పార్టీ అభ్యర్థి షేక్ ఖలీల్‌కు మద్దతు తెలపాలని కోరారు.

# 'ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారు'

## - టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటంతో దిక్కుతోచని బీఆర్ఎస్ నేతలు లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్రంలో ప్రజలు రైతులు అన్ని వర్గాలు సంతోషంగా ఉండడం జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన మండిపడ్డారు. అమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలో సోమవారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్య నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా లతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తుంటే మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అవగాహన లేకుండ మాట్లాడడం సరికాదన్నారు. తలకొండపల్లి మండలం వెల్జల్ లో ఓ కార్యక్రములో పాల్గొనడానికి వెళ్తున్న శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, ఆ పార్టీ నాయకులు రోడ్డు పక్కన ఒక రైతు పంటకు వ్యక్తిగత కారణాలతో నీరు అందించా లేక ఎండిపోయిన మొక్క జొన్న పంటను చూసి కరెంటు లేక చేను ఎండిపోయిందని ప్రభుత్వంపై విమర్శలు చేయడం వారి అవగాహన లేమికి నిదర్శనమన్నారు. సమీప పొలాల్లో పచ్చగా కళకళలాడుతున్న పంటలు శ్రీనివాస్ గౌడ్, జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులకు కన్పించ లేదా అని ఆయన ప్రశ్నించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఎక్కడ విద్యుత్ సమస్యలు లేవని, వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా 18 గంటలు విద్యుత్ సరఫరా జరుగుతుందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సహకారంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ. 100 కోట్ల వ్యయంతో కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, ఉప కేంద్రాల స్థాయి పెంపు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఏడు మండలాల పరిధిలో సుమారు 1000 కొత్త ట్రాన్స్ ఫార్మర్లు బిగించడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి రోజుకు ఆరు గంటలు విద్యుత్ సరఫరా జరుగుతుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొనడం సరికాదన్నారు. ప్రజలు, రైతులకు తప్పుదోవ పట్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉనికి కోసం ప్రభుత్వంపై బురద చల్లడం బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలన్నారు. చంద్రధన ఉప కేంద్రంలో కొత్తగా 5ఎంవీఏ పవర్ ట్రాన్స్ఫార్మరు వేర్పాటు చేయడం జరిగిందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రజా రంజక పాలన చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు గగ్గోలు పెడుతున్నారే తప్ప ప్రజలు, రైతులు ప్రభుత్వ తోడ్పాటుతో సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన విదంగా రూ.2 లక్షల రుణమాఫీ . సన్న వడ్లకు రూ.500 బోనస్, దాన్యానికి మద్దతు ధర కల్పనతో పాటు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ, సకాలలో ఎరువులు, విత్తనాలు పంపిణీ ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. రైతు భరోసా రెండో విడత డబ్బులు కూడ విడుదల చేయడం జరిగిందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వాస్తవాలు వక్రికరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలనే ఎత్తుగడలు బీఆర్ఎస్ నాయకులు వీడకపోతే ప్రజా క్షేత్రంలో మరోమారు గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, కండె రంగయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బీచ్య నాయక్, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాలే మల్లయ్య, అబ్దుల్ ఖాదర్, కుమార్ గౌడ్, రహీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, రమేశ్, పూసల సత్యం, దేవరశెట్టి మహేశ్, డిగ్రీ కృష్ణ, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ నిర్మాణం శుభ పరిణామం..

## సర్పంచ్ సుగుణ సంపత్











**ఇబ్రహింపట్నం ,ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాచారం మండల పరిధిలోని నక్కర్త హనుమాన్ దేవాలయం పునః నిర్మాణం స్వామి దేవాలయ శిలా శంకుస్థాపన మహోత్సవం దేవాలయ చైర్మన్ సింధం అంజయ్య కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రవీణ్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ ఉపసర్పంచ్ ధెంది మధుకర్ రెడ్డి పలు గోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ సుగుణ సంపత్ మాట్లాడుతూ... గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం జరగడం ఎంతోశుభపరిణామమని తెలిపారు. ఈ దేవాలయం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యం అందించే పవిత్ర స్థలంగా మారాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌహార్దం, ఐక్యత పెరగాలని కోరుతూ దేవాలయ నిర్మాణానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.

# 'హర్మూజ్'లో భారత నౌకలకు ఇండియన్ నేవీ అడ్వయిజరీ



**న్యూఢిల్లీ ,ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హర్మూజ్ జలసంధి లో భారత జెండా తో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు ఇటీవల కాల్పులు జరిపాయి. ఈ నేపథ్యంలో భారత జెండా కలిగిన నౌకలకు మన నౌకాదళం అడ్వయిజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొన్నది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని తెలిపింది. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుందని చెప్పింది.యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. ఈ జలసంధిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ. అదేరోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

# అఫిడవిట్లలో రూ.100 కోట్ల తేడా ఉంది..

## -టీవీకే చీఫ్ విజయ్‌కి మద్రాస్ హైకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ :,ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
టీవీకే చీఫ్ విజయ్ కి మద్రాసు హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో అవకతవకలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దానిని పరిశీలించిన అనంతరం సోమవారం కోర్టు ఈ నోటీసులు ఇచ్చింది. విజయ్‌కి సమర్పించిన అఫిడవిట్లలో తేడాలు ఉన్నాయంటూ చెన్నైకి చెందిన వీవీ విఘ్నేశ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు.కాగా తిరుచ్చి, పెరంబూర్ నియోజకవర్గాల నుంచి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పోటీచేస్తున్నారు. పెరంబూర్‌లో సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన ఆస్తుల వివరాలు రూ.115 కోట్లుగా ఉండగా.. తిరుచ్చిలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చిన వివరాల్లో వెల్లడించిన ఆస్తుల విలువ రూ.220 కోట్లుగా ఉందని పిటిషనర్ ఆరోపించారు. ఇలా ఎందుకు తేడా చూపించాల్సి వచ్చిందో వివరించేలా ఎలాంటి అనుబంధ పత్రాలు విజయ్ ఇవ్వలేదన్నారు. కాగా వచ్చేవారం దీనిపై తదుపరి విచారణ జరగనుంది.